క్లుప్తంగా

గ్రామ సంఘాలకు ఆన్‌లైన్ శిక్షణ

అల్లవరం: సెర్ప్ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల ప్రతినిధులకు డ్వాక్రా సంఘాల కార్యకలాపాలపై బుధవారం ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు నీతిపూడి స్వర్ణలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డ్వాక్రా సంఘాలు, విధులు, బాధ్యతలు, సంఘ ఉపయోగాలు, పుస్తక నిర్వహణ, సంఘ కార్యచరణపై శిక్షణ ఇచ్చారు. ఏపీఎం సయ్యద్, సీసీలు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో వేణుసాగర్ ప్రతిభ


వేణుసాగర్

ముమ్మిడివరం: ఇటీవల కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో స్థానిక హెల్దీలైఫ్ జిమ్ విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. అండర్–17 కేటగిరిలో 102 కేజీల విభాగంలోను 106 కేజీల విభాగంలో దొమ్మేటి వేణుసాగర్ రజిత పతకం సాధించాడు. అతడిని కోచ్ వాసంశెట్టి నరేష్, లాయర్ నాగరాజు, చిట్టూరి ప్రవీణ్, కురుణ్‌కుమార్, వంశీ అభినందించారు.

ఏడుగురికి హెచ్‌సీలుగా పదోన్నతి

యానాం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తూ 15 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఏడుగురికి హెడ్ కానిస్టేబుల్ (స్పెషల్ గ్రేడ్)గా పదోన్నతి కల్పిస్తూ బుధవారం పుదుచ్చేరి ఎస్పీ (హెడ్‌క్వార్టర్స్) సుభమ్‌ఘోష్ ఆదేశాలు జారీచేశారు. కడలి శ్రీనివాసరావు, కడలి మధుసూదనరావు, కడలి మహాలక్ష్మీరావు, దవులూరి హరినాథ్, కోన సర్వేశ్వరరావు, కె జగన్నాథమ్, నక్కా శ్రీను ఈ పదోన్నతులు పొందారు. అలాగే ఎస్సైలుగా తోట వెంకటేశ్వరరావు, ఆర్.అబ్బులు పదోన్నతి పొందారు.

వృథాగా 'గోరుముద్ద' చెక్కీలు


మురుగు కాల్వ పక్కన పడి ఉన్న చెక్కీ ప్యాకెట్లు

ముమ్మిడివరం: జగనన్న గోరుముద్ద పథకం కింద చిన్నారులకు ఇవ్వాల్సిన చెక్కీలను స్థానిక వృద్ధ గౌతమి మురుగు కాల్వ పక్కన పడి ఉండడాన్ని అధికారులు గుర్తించారు. ఈ విషయమై ఎంఈఓ బొజ్జా రమణశ్రీని వివరణ కోరగా ఈ ప్యాకెట్ల కాల పరిమితి ముగియడంతో డీలర్లు పడవేసి ఉంటారని, పాఠశాలల్లో అయితే అంత పెద్ద మొత్తంలో మిగిలి పోయే పరిస్థితి లేదన్నారు. గత ఏడాది 9, 10 నెలలకు సంబంధించినవని, డీలర్‌ను విచారించగా అవి ఇక్కడివి కావని తేలిందన్నారు. చెక్కీలు తయారైన తరువాత వాటి కాలపరిమితి 60 రోజులు మాత్రమే ఉంటుందన్నారు.

యథేచ్ఛగా మట్టి రవాణా


వానపల్లిపాలెంలో మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్

ఉప్పలగుప్తం: మండలంలోని పెదగాడవిల్లి నుంచి వానపల్లిపాలెం గ్రామానికి బుధవారం ఉదయం నుంచి అనధికార మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతుంది. ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రహదారులను పాడుచేస్తూ, విద్యార్థులకు ప్రమాదకరంగా వాహనాలు నడుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. పెదగాడవిల్లి వీఆర్‌ఓ మహ్మద్ అలీషాను వివరణ కోరగా మట్టి తవ్వకాలకు, రవాణాకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

గేదెల్లంకలో ఇదేం ఖర్మ

ముమ్మిడివరం: మండలం గేదిల్లంకలో మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు, అర్థాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీఓ-1 రద్దుచేయాలి

తాళ్లరేవు: రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీఓ నెం.1 తక్షణమే రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వివిధ పార్టీల నాయకులు ధర్నా చేసి అనంతరం తహసీల్దార్ పోతురాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టేకుమూడి ఈశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, ముత్యాల జయలక్ష్మి, అత్తిలి బాబూరావు, టి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

లాల్‌బహదూర్‌శాస్త్రి వర్ధంతి

యానాం: దివంగత ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రహదారిలో ఆయన విగ్రహానికి ఆర్‌ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, సీఐ గూటం శివగణేష్ నివాళులర్పించారు. అలాగే ఈ నెల 26వ తేదీ రిపబ్లిక్ డే వేడుకల నిర్వహణపై బుధవారం ఆర్‌ఏఓ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆరోజు బాలయోగి స్టేడియంలో జరిగే వేడుకల ఏర్పాట్లు, తదితర విషయాలపై చర్చించారు.


నారాయణస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు


బొమ్మల కొలువులో సందడి చేస్తున్న చిన్నారులు


రవి డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు

అతిథి దేవోభవ

- సంస్కృతి, సంప్రదాయాలకు నాటి, నేటి తరాల వారధులు
- పెద్ద పండగకు ముందస్తు సందడి






గ్రామాల్లో సందడి చేస్తున్న జంగమ దేవర, హరిదాసు, బుడబుక్కల కళాకారుడు, కొమ్మదాసరి, గంగిరెద్దు విన్యాసాలతో దూడూ బసవన్నలు

ముమ్మిడివరం: హరిహరిలో రంగా హరీ.. శ్రీమద్రమా రమణ గోవిందో హరిః.. అంటూ సందడి చేసే హరిదాసు కీర్తనలు.. బలే దొడ్డదొరండీ మా బసవన్న అంటూ సందడి ఒకవైపు.. అంబ పలుకు జగదంబ పలుకు.. అంటూ జంగమ దేవర శంఖారావం మరో వైపు.. వీరితో పాటు కొమ్మదాసరులు ఊరంతా సంక్రాంతి సందడి తీసుకువచ్చే ప్రాచీన సంస్కృతి సంప్రదాయాల మేళవింపు ఈ కళారూపాలు. ముంగిట్లో మగువలు అద్దిన ముగ్గులతో, అటునిటు తిరుగుతూ హరిదాసులు, జంగమదేవరలు, కొమ్మదాసరులు, దూడూ బసవన్నలు, భోగి పిడకల దండలు గుచ్చుతూ యువతులు, చిన్నారులు, భోగి మంటకు దుంగలు సేకరిస్తూ యువకులు, పెద్దరికం చాటుకుంటూ పిల్లలను అదిరిస్తూ వృద్ధులు సంక్రాంతి పండగకు శోభ తీసుకువస్తున్నారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో ఎక్కడిక్కడ చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా అంతా ఊరంతా సందడి చేస్తున్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

ముమ్మిడివరం: ముండలంలో గాడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.రాధాకృష్ణ, గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి మునీంద్రరావు, ఎంపీటీసీ గిరిగి వీర దుర్గాకుమారి, స్కూలు కమిటీ చైర్మన్ మహాదశ వెంకట సుబ్బారావు, పీడీ విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక రావు బహదూర్ రఘుపతి వెంకటరత్నం నాయుడు డిగ్రీ, శ్రీకృష్ణదేవరాయ జూనియర్ మహిళా కళాశాలలో సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీల విజేతలకు 18వ వార్డు కౌన్సిలర్ గణేశుల అరుణ బహుమతులు అందజేశారు. కళాశాల డైరెక్టర్ గణేశుల బ్రహ్మానందం, ప్రిన్సిపాల్ శ్రీరామూర్తి పాల్గొన్నారు.

ఐ.పోలవరంలో..

ఐ.పోలవరం: మండలంలోని పశువుల్లంక, మురమళ్ల జెడ్పీ పాఠశాలలో, మురమళ్ల సాయి హైస్కూల్ ఆవరణలో, ఎదుర్లంక, కేశనకుర్రు, ఐ.పోలవరం తదితర గ్రామాల్లో పాఠశాలలో సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు.

ఉప్పలగుప్తంలో..

ఉప్పలగుప్తం: మండలంలో చల్లపల్లి, గొల్లవిల్లి, ఎస్.యానం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు, వివిధ వేషధారణలతో అలరించారు. రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలతో, భోగి మంటలతో విద్యార్థులు సందడి చేశారు. అనంతరం గొల్లవిల్లి ముగ్గులు పోటీల్లో విజేతలకు కోకో కోలా సంస్థ తరపున బహుమతులు అందజేశారు. హెచ్‌ఎంలు గుబ్బల సత్యనారాయణ, లంకా రాణి, కె.సత్యరాజు, పీడీలు గొలకోటి ఫణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యానాంలో..

యానాం: పట్టణ పరిధిలోని రాజీవ్‌బీచ్‌లో ఉన్న చైల్డ్‌లైన్, మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించి దాత సీహెచ్ సూర్యకళ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక నారాయణ స్కూల్‌లో, రమాభాయినగర్‌లో మ్యాచ్‌బాల్ క్రికెట్ టోర్నీ నిర్వహించారు. టోర్నీకి ముఖ్య అతిథులుగా తెలగా, కాపు సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి రామ్మూర్తి, కాపగంటి సుమన్‌బాబు, రెయ్యా రాజు, రేవు రేవతి నిర్వాహకులుగా యాళ్ల వెంకట్‌కుమార్, కమిడి దత్తు పాల్గొన్నారు.

అమలాపురంలో..

అమలాపురం రూరల్: మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మండల పరిధి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ కాశీ విజయప్రసాద్ బహుమతులు అందజేశారు. సాకుర్రులోని దివ్యతేజ పాఠశాలలో, సమనస శ్రీరామ పబ్లిక్ స్కూల్‌లో, బండారులంక కృష్ణవేణి పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

అమలాపురం టౌన్: స్థానిక వడ్డిగూడెంలోని శ్రీవాగ్దేవి పాఠశాల ప్రాంగణంలో పాఠశాల డైరెక్టర్లు పరసా భరత్, భరత్ ఆధ్వర్యంలో చిన్నారులు వివిధ వేషధారణల్లో సందడి చేశారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు: మండలంలోని సుంకరపాలెం నల్లం హైస్కూల్‌లో చైర్మన్ నల్లం నాగబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు సర్వారాయ సుగర్‌ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. అలాగే రవి డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, చైర్మెన్ వెంకటేశ్వరరావు, డిస్ట్రిబ్యూటర్ గోపి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు రంగం సిద్ధం

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరంలో సంక్రాంతి సంబరాలు–2023 నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జిల్లా స్థాయి మహిళా కబడ్డీ పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ముత్యాల జయలక్ష్మి, ధూళిపూడి గొల్లబాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద పంచాయతీ కార్యాలయ ఆవరణలో మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 13, 14 తేదీలలో మహిళా కబడ్డీ పోటీలు, 15వ తేదీన ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. విళ్ల వీర, ధూళిపూడి శుభ, దున్నా రాజు, విళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


గాడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు



పశువుల్లంక, గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో భోగి మంటల వద్ద సందడి చేస్తున్న విద్యార్థులు


అమలాపురంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ


మురమళ్ల సాయి హైస్కూల్‌లో చిన్నారుల కోడి పందేలు

గాంధీనగర్ రహదారి నిర్మాణానికి రూ.3.98 కోట్లు

- మంత్రి పినిపే విశ్వరూప్
- సామంతకుర్రులో గడప గడపకూ..


రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: రెండు మండలాల ప్రజల చిరకాల స్వప్నం సామంతకుర్రు–గాంధీనగర్ రహదారి నిర్మాణానికి మోక్షం లభించిందని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండల నోడల్ అధికారి జి.సరోవరరావు ఆధ్వర్యంలో సామంతకుర్రులో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఆయన కుమారుడు పినిపే శ్రీకాంత్‌తో కలసి గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం వలంటీర్ల ద్వారా అందజేస్తున్న పథకాలు అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు వర్తించకపోతే సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సామంతకుర్రు నుంచి గాంధీనగర్ మీదుగా రహదారి నిర్మాణానికి ఇంత కాలానికి మోక్షం లభించిందన్నారు. సామంతకుర్రు రామాలయం నుంచి గాంధీనగర్ శివారు వరకు రహదారి నిర్మాణం, వాసాలతిప్ప డ్రైన్‌పై వంతెన నిర్మాణానికి రూ. 3.98 కోట్లు నిధులు మంజూరు చేసినట్టు మంత్రి విశ్వరూప్ తెలిపారు. ప్రజల తాగునీటి ఇబ్బందులను పరిష్కరిస్తామని మంత్రి మహిళలకు హామీ ఇచ్చారు. తొలుత రోడ్డు నిర్మాణానికి మంత్రి విశ్వరూప్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల రామకృష్ణ, సర్పంచ్‌లు సుందనీడి సాయి, కొల్లు వెంకటరమణ, సాధనాల వెంకటరావు, ఎంపీటీసీ కర్రి సత్యశ్రీనివాస్, గ్రామకమిటీ అధ్యక్షుడు చెదళ్ల వాసుదేవుడు, మాజీ రాష్ట్ర కార్యదర్శులు బొమ్మి ఇజ్రాయిల్, పార్టీ నాయకులు గుంటూరి బాలరాజు, తిక్కా ప్రసాదు, కొనుకు మహేష్, గుంటూరి సత్యనారాయణరాజు, పరసా రాంబాబు, గుత్తుల వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సాంబశివప్రసాదు, ఇతర మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వినోదంలో విషాదం

- భోగి మంట చెలరేగి ముగ్గురు విద్యార్థులకు గాయాలు
- స్కూలు డైరెక్టర్‌పై కేసు నమోదు
- స్కూలుపై చర్యలకు డీఈవో ఆదేశం


విద్యార్థినిని పరామర్శిస్తున్న ఎంపీ అనురాధ

అమలాపురం టౌన్/ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి విజ్డమ్ పాఠశాల ప్రాంగణంలో బుధవారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో అపశృతి చోటుచేసుకుంది. భోగి మంట వద్ద ఓ ఉపాధ్యాయుడు పెట్రోలు సీసాతో చేసిన చిన్న తప్పిదంతో ముగ్గురు విద్యార్థులు మధుర కీర్తన, దుగుమర్తి శామ్యూల్ స్టీఫెన్ పాల్, పోతుల వనీషల శరీర భాగాలు తీవ్రంగా కాలిపోయాయి. వారి ఉదర భాగాలు, చేతులు, కాళ్లు కాలడంతో వారు పెట్టిన కేకలకు తోటి విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ఇంతలో తమ పిల్లలు స్కూలులో గాయపడ్డారని తెలిసి హుటాహుటీన వచ్చిన వారి తల్లిదండ్రులు తమ పిల్లల బాధను చూసి తట్టుకోలేకపోయారు. వనీష తల్లిదండ్రులు రాజేష్, బాలవేణి తమ కుమార్తె దుస్థితిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. స్కూలు యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తల్లిదండ్రులు ధ్వజమెత్తారు. సంక్రాంతి సంబరాల్లో అలక్ష్యంగా వ్యవహరించిన స్కూలుపై చర్యలు తీసుంటామని ఎంఈవో కె.కిరణ్‌బాబు చెప్పారు. డీఈవో రవిసాగర్ ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసి స్కూలుపై చర్యలకు ఆదేశించారు. స్కూలు డైరెక్టర్ దేవరపల్లి రాంబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉప్పలగుప్తం ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

23 నుంచి రాజరాజేశ్వరస్వామి కల్యాణమహోత్సవాలు

యానాం: స్థానిక రాజరాజేశ్వరి సమేత రాజరాజేశ్వర స్వామివారి కల్యాణమహోత్సవాలను ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 10 వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ సముదాయ కమిటీ అధ్యక్షుడు కాపగంటి ఉమాశంకర్ తెలిపారు. బుధవారం ఉత్సవాల ఆహ్వానపత్రికలను ఆలయంలో ఆవిష్కరించారు.


ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన కమిటీ కార్యవర్గం, పుర ప్రముఖులు

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు


క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీ అనురాధ

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడుపూడి శివన్నారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న 11వ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు రెండో రోజు హోరాహోరీగా జరిగాయి. కాకినాడ జిల్లా పి.మల్లవరం జట్టు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యానం జట్టు, విశాఖపట్నం జట్లు ఉత్తమ ప్రతిభను కనబరిచాయి. పోటీలకు ముఖ్య అతిథిగా వచ్చిన అమలాపురం ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. నేషనల్ రిఫరీ బి.ప్రసాద్, స్టేట్ రిఫరీలు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి లోవరాజు, పంపన రామకృష్ణ, ఎడ్ల కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు వస్త్రదానం


వృద్ధులకు వస్త్రదానం చేస్తున్న రామ కృష్ణారావు, ప్రతాప్

అమలాపురం రూరల్: మండలంలోని ఇమ్మిడివరప్పాడు మదర్ థెరిస్సా అనాథ, వృద్ధాశ్రమాన్ని కాంగ్రెస్ నాయకుడు, హైకోర్టు న్యాయవాది ముషిణి రామకృష్ణారావు, ప్రవాస భారతీయుడు ముషిణి ప్రతాప్ బుధవారం సందర్శించి రెండు నెలలకు సరిపడే బియ్యం, వృద్ధులకు వస్త్రదానం చేశారు. అమెరికా నుంచి ఇటీవల స్వస్థలం అమలాపురానికి వచ్చి ఆశ్రమ నిర్వాహకుడు రాపాక విక్టర్ సేవలను అభినందించారు.

విద్యార్థుల భద్రత మరచి..


శిథిలాలను తొలగిస్తున్న కార్మికుడు, కింది భాగంలో విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

అల్లవరం: మండలం ఎస్.రామేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల రక్షణలో ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకుల నిర్లక్ష్యానికి నిదర్శనం ఈ చిత్రం. ఎస్.రామేశ్వరంలో శిథిలావస్థకు చేరిన తుపాను రక్షిత భవనాన్ని తొలగించేందుకు కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ బాధ్యత తీసుకున్నారు. బ్రేకర్ల సాయంతో బుధవారం మధ్యాహ్నం పై అంతస్తు శిథిలాలను తొలగిస్తున్నారు. అదే సమయంలో పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులకు ఈ భవనం కింద భాగంలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు. వారిపై శిథిల శకలాలు పడే ప్రమాదాన్ని ఎవరూ గుర్తించకపోవడం శోచనీయం. జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. హెచ్‌ఎంను వివరణ కోరగా తాను భోజనం చేస్తున్నానని, చూడలేదని సమాధానం దాటవేశారు.

రోడ్డు సేఫ్టీ వారోత్సవాలు ప్రారంభం


రోడ్డు సేఫ్టీ వారోత్సవాలను ప్రారంభిస్తున్న డీఆర్వో సత్తిబాబు

అమలాపురం రూరల్: రోడ్ సేఫ్టీ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాంతీయ అధ్యక్షుడు అరిగెల వెంకట రామారావు అధ్యక్షతన 11 నుంచి 17వ తేదీ వరకు రోడ్డు సేఫ్టీ వారోత్సవాలు నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో రోడ్ సేఫ్టీ వారోత్సవాలను డీఆర్‌ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు వలన మానవ వనరులను కోల్పోతున్నామని, కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని, దేశాభివృద్ధికి నష్టం వాటిల్లుతోందని అన్నారు. రోడ్డు ప్రమాదాలు వల్ల అదనపు వైద్య ఖర్చులతో కుటుంబాలు ఎంతో నష్టపోతున్నామన్నారు. అయినవారిని కోల్పోయిన వారు అనేకమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇటువంటి దుస్థితిని ఎదుర్కొనేందుకు అందరూ తప్పనిసరిగా రహదారి భద్రత నియమావళిని పాటించాలని సూచించారు.

బీవీసీ ఇంజినీరింగ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థులతో బీవీసీ అధ్యాపకులు

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలో 2006–10 విద్యా సంవత్సరం ఈఈఈ విభాగానికి ఇంజినీరింగ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులతో గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీవీసీ అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.